# పార్టీకతీతంగా సంక్షేమ పథకాలు





# ప్రజాపక్షం జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

శనివారం | 17 అక్టోబరు, 2026 | పేజీలు :08


## ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ

### రూ.5.45 కోట్లతో ఇళ్ల నిర్మాణం..వచ్చే బతుకమ్మ సొంతింట్లోనే



**ప్రజాపక్షం/ములుగు:** పేదల సొంతింటి కలను సాకారం చేసేం దుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. బతుకమ్మ పండగ వేళ రెండవ విడతలో భాగంగా గోవిందరావుపేట మండ లంలోని 13 గ్రామాలకు చెందిన 109 మంది లబ్ధిదారులకు శుక్ర వారం ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఒక్కో ఇంటికి రూ.5లక్షల చొప్పున మొత్తం రూ.5.45 కోట్లతో నిర్మాణాలు చేపట్ట నున్నారు. జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టామని, మొదటి విడతలో ములుగు నియోజకవర్గానికి సుమారు ఐదు వేల ఇళ్ల మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రస్తుత విడతలో ఇళ్ల మంజూరు కాని అర్హులు ఆందోళన చెందవద్దని తదుపరి విడతల్లో అవకాశం కల్పిస్తామని చెప్పారు. వచ్చే ఏడాది లబ్ధిదారులు తమ సొంతిళ్లలో బతుకమ్మ వేడుకలు జరుపుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇళ్ల నిర్మాణానికి పునాది పూర్తయిన తర్వాత బిల్లులు చెల్లింపులు ప్రారంభమవు తాయని, మహిళా సంఘాల సభ్యులైన లబ్ధిదారులకు ప్రారంభ ఖర్చుల కోసం సంఘాల ద్వారా రూ.లక్ష రుణం పొందే అవకాశం ఉందని వివరించారు. నిర్మాణాలకు అవసరమైన ఇసుకను అందుబాటులో ఉంచేలా అధికారులు చర్యలు తీసుకో వాలని, సర్పంచ్‌లు లబ్ధిదారులకు సహకరించాలని సూచించారు. కొత్త పింఛన్ల దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఉపాధి హామీ పనులను విస్తృతంగా చేపట్టి గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించాలని కోరారు. ప్రకృతి మార్పుల వలన ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి సుధీర్ రామ్‌నాథ్ కేకన్, అదనపు కలెక్టర్ సంపత్‌రావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల బాల్యాన్ని బలోపేతం చేయాలి

### ప్రతీ చిన్నారికి పౌష్టికాహారం అందించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలి

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారుల బాల్యాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రతి చిన్నారికి పౌష్టికాహారం అందించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు పోషకాహా రం ఎంతో కీలకమని పేర్కొన్నారు. శుక్రవారం జ యశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఐడిఓసి కార్యాలయంలో మహిళా, శిశు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 9వ జాతీయ పోషణ మాసం వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శన స్టాళ్లను ఎమ్మెల్యే, కలెక్టర్ పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన పౌష్టికాహారం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, స్థానికంగా సహజంగా లభించే పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాల వినియోగంపై అధికారులు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాల నిర్మాణానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అంగన్వాడీ టీచర్లు చిన్నారులకు విద్యాబోధన చేయడంతో పాటు వారి ఆరోగ్య సంరక్షణలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారని అభినందించారు. జిల్లాలో సొంత భవనాలు లేని అంగన్వాడీ కేంద్రాలను గుర్తించి, అవసరమైన చోట స్థలాలు కేటాయించి, ప్రభుత్వ నిధులతో నూతన భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పోషణ ఛాంపియన్లకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి మల్లీశ్వరి, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా ఆరుతడి పంటల సాగు



### యాంత్రీకరణ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం /జనగామ :** ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ ఆరుతడి పంటల్ని సాగు చేయాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా రైతులకు సూచించారు. తక్కువ నీటితో సాగయ్యే పంటల్ని మాత్రమే ఎంచుకోవాలన్నారు. శుక్రవారం జిల్లాలోని స్టేషన్‌ఘనపూర్ మండలంలో శివునిపల్లిలో గల రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎల్‌నినో ప్రభావం, పంటల మార్పిడిపై నిర్వహించిన అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడే ఎల్‌నినో ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపుతుందని, దీని వలన వర్షాపాతం తగ్గడంతో పాటు ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు. దీని మూలంగా వ్యవసాయ రంగంలో అనేక మార్పులు, సమస్యలు తలెత్తనున్నట్లు వివరించారు. జిల్లాలో అక్టోబర్ 16 నాటికి 800మిలీ మీటర్ల వర్షాపాతం నమోదు కావాల్సి ఉండగా 520 మిల్లీ మీటర్లు మాత్రమే నమోదైందని, లోటు వర్షాపాతం దృష్టిలో ఉంచుకొని రైతులు పంటల్ని ఎంచుకోవాలన్నారు. వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు అయినా శనగ, కంది, పెసర వంటి పప్పు ధాన్యాలు, నూనెగింజల పంటలు సాగు చేయాలని తక్కువ నీటితో సాగయ్యే పంటల్ని మాత్రమే ఎంచుకోవాలన్నారు. ఉద్యాన పంటలైన బత్తాయి, కొబ్బరి, జామ, సీతాఫలం, వంటి ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని, అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మైక్రో ఇరిగేషన్ విధానమైన డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాల ఏర్పాటుకు అర్హతలను బట్టి 80 శాతం నుండి 90 శాతం సబ్సిడీ ఇస్తుందని, తెలిపారు. రైతులు ఈ అవకాశాల్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కూరగాయలు, ఆకుకూరలు సాగు చేయాలని, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోని, ఏడిఏ అపర్ణ, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి మురళీధర్‌రావు, మున్సిపల్ కమీషనర్ రాధాకృష్ణ, ఏసిపి భీమాశర్మ, ఎంపిడిఓ విజయశ్రీ, సర్పంచ్ హరిత తదితరులు పాల్గొన్నారు.

## 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్'తో వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి చర్యలు

### అభివృద్ధి పనుల ప్రతిపాదనలు, డిపిఆర్‌లను వివరించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



**ప్రజాపక్షం/హనుమకొండ :** రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి, సిడిఎంఏ డాక్టర్ టి.కె. శ్రీదేవి శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్రంలోని మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద చేపట్టనున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు.ఈ సందర్భంగా హన్మకొండ జిల్లా కలెక్టరేట్ నుంచి పాల్గొన్న జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్‌పాయ్, జీడబ్ల్యూఎంసి కమిషనర్ టి. వెంకన్న పాల్గొని మాట్లాడుతూ... గ్రేటర్ వరంగల్ నగరంలో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద ప్రతిపాదించిన అభివృద్ధి పనులు, వాటికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికల వివరాలను వెల్లడించారు.నగరంలో ఆర్థిక కార్యకలాపాల అభివృద్ధి, రవాణా ఆధారిత పట్టణాభివృద్ధి, ప్రా ంతీయ ప్రణాళిక, పట్టణ పునరుద్ధరణ, తాగునీరు, పారిశుధ్యం, నగర ప్రాంతాల పునరాభివృద్ధి వంటి కీలక అంశాలకు సంబంధించిన ప్రతిపాదనలను వివరించారు. నగర భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సిపిఓ అజిత్ రెడ్డి, సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మహేందర్, రవికుమార్, సంజయ్ కుమార్, భీమ్‌రావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కుష్టు వ్యాధి లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించాలి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి
డాక్టర్ బి. రాజా రెడ్డి




**ప్రజాపక్షం / వరంగల్ :** కుష్టు వ్యాధి లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి అన్నారు. జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్‌సిడిసి) పై పునశ్చరణ శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి. రాజా రెడ్డి మాట్లాడుతూ 2026 అక్టోబర్ 22 నుంచి నవంబర్ 4 వరకు ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది ఇంటింటి సందర్శనలు నిర్వహించి, ప్రజలకు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించడంతో పాటు వ్యాధి లక్షణాల గుర్తింపునకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రతి ఇంటిలోని ప్రతి వ్యక్తిని పరిశీలించి, కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రజలు తమ శరీరంపై స్పర్శ జ్ఞానం లేని రాగి లేదా గోధుమ రంగు మచ్చలు కనిపించినట్లయితే నిర్లక్ష్యం చేయకుండా, వెంటనే తమ ఇంటికి వచ్చే ఆశా కార్యకర్తలు లేదా వైద్య సిబ్బందిని సంప్రదించాలని, లేదా సమీప ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి, వైద్యుల సూచనల మేరకు పూర్తిస్థాయి చికిత్స తీసుకుంటే వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. ఈ పునశ్చరణ శిక్షణ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, డీఐఓ డాక్టర్ ఐ. ప్రకాష్, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ ఇక్తిదార్ అహ్మద్, డాక్టర్ అరుణ్ జోషి, లెప్రసీ విభాగం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మానస, డిప్యూటీ పారామెడికల్ అధికారి వెంకన్న, డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు, వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, నోడల్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన నూతన ఎస్ఐ

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** దేవరుప్పుల మండల నూతన ఎస్ఐగా చింత రాజు బాధ్యతలు స్వీకరించిన అనంతరం శుక్రవారం పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో వారు మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు.

## ములుగు జిల్లా ఎస్‌టిసెల్ అధ్యక్షుడిగా అయ్యోరి యాణయ్య



**ప్రజాపక్షం/మంగపేట :** తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు శుక్రవారం మంగపేట మండలంలోని దోమెడ గ్రామ పంచాయతీకి చెందిన అయ్యోరి యాణయ్యను కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా ఎస్‌టి సెల్ అధ్యక్షుడిగా నూతనంగా ఏకగ్రీవంగా ప్రకటించిన ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ పటేల్ ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ, ములుగు జిల్లా ఎస్‌టిసెల్ విభాగంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రవేశపెడుతున్నా సంక్షేమ పథకాలు గడప గడపకు తెలియజేస్తూ కాంగ్రెస్‌బలోపేతానికి కృషి చేయాలి అని ఆకాంక్షిస్తూ అయ్యోరి యాణయ్యకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, ఆత్మ చైర్మన్ చిటమట రఘు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న జిల్లా ప్రధాన కార్యదర్శి గుడ్ల దేవేందర్, మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు, ఏటూరునాగారం మండల అధ్యక్షులు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

## వ్యాపారులు సహకరించాలి

**ప్రజాపక్షం/తరిగొప్పుల:** నిత్యం రద్దీగా ఉండే మండల కేంద్రంలో విచ్చలవిడిగా రోడ్లపైనే వాహనాలను నిలపడంతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని దీన్ని దృష్టిలో పెట్టుకుని మండల కేంద్రంలో రోడ్డు ఆక్రమణల తొలగింపు కార్యక్రమం మొదలు పెట్టామని గ్రామ పంచాయితీ పాలకవర్గం తెలిపారు. వ్యాపారస్తులు అందరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చిలువేరు మహేందర్, వార్డు మెంబర్లు పింగిలి వేణుగోపాల్ రెడ్డి, తాళ్ల పల్లి రాజు, సృజన్, రాజేష్ నాయక్, కుమార్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమం కేసులో జెఏసి నాయకులకు ఊరట



**ప్రజాపక్షం/జఫర్‌గఢ్:** వరంగల్ జిల్లా ఉద్యమ సమయంలో నమోదైన రెండో కేసును స్టేషన్‌ఘనపూర్ కోర్టు కొట్టివేయడంతో జెఏసి నాయకులకు ఊరట లభించిందని జాఫర్‌గఢ్ మండల జెఎసికన్వీనర్ బానోత్ రాజేష్ నాయక్ తెలిపారు. మండలాన్ని తిరిగి హన్మకొండ జిల్లాలో కలపాలని కోరుతూ ఉద్యమం చేపట్టిన నాయకులపై గతంలో కేసులు నమోదయ్యాయని గుర్తు చేశారు. మండల ప్రజల చిరకాల కోరికను నెరవేర్చేందుకు మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కేసును సంబంధించి పలువురు జెఏసి నాయకులు రాజేష్ నాయక్, బిక్షపతి, మోహన్ రావు, రాజు, వెంకటస్వామి, సదయ్యగౌడ్, రాజేందర్, సుధాకర్, రమేష్, ఛబీబ్ ఖాన్, బాబు, యాకయ్య, కృష్ణమూర్తి, రవికుమార్ కోర్టుకు హాజరయ్యారు.

## పారా మెడికల్ డిప్లొమా కోర్సుల ప్రవేశాలకు ఆహ్వానం

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** తెలంగాణ పారా మెడికల్ బోర్డు సెక్రటరీ ఆదేశాలతో పారా మెడికల్ డిప్లమా కోర్సులలో 2026–27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కొరకు నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని జనగామ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. డీఎంఐటీలో 30, డీఓఏ 30 కోర్సులకు అర్హత గల విద్యార్థుల నుండి దరఖాస్తులను కోరడం జరుగుతుందన్నారు. ఈ దరఖాస్తులకు సమర్పించేందుకు గాను చివరి తేదీ 24 అక్టోబర్‌లోగా జనగామ మెడికల్ కాలేజీలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

## కళ్లకు గంతలతో నిరసన తెలిపిన ఎన్‌హెచ్ ఉద్యోగులు

4వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె
సమస్యలు పరిష్కరించే వరకూ
సమ్మె విరమించేదిలేదు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నేషనల్ హెల్త్ మిషన్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 4వ రోజు కు చేరుకుంది. నిరవధిక సమ్మెలో భాగంగా శుక్రవారం ఉద్యోగులు కళ్లకు గంతలు కట్టుకుని కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. సమ్మెలో భాగంగా నాలుగవ రోజు వినూత్న రీతిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా ప్రజారోగ్య రంగంలో కీలక పాత్ర పోషిస్తూ, ప్రభుత్వ ఆరోగ్య సేవలను ప్రజలకు చేరవేయడంలో నిరంతరం కృషి చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని, తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించే వరకు తమ పోరాటాన్ని ఐక్యంగా, శాంతియుతంగా కొనసాగిస్తామని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం జేఏసీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా జిల్లా అధ్యక్షుడు బడితల రమేష్, సెక్రటరీ మధు బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్, వైస్ ప్రెసిడెంట్ డా॥ రఘురాం, కోఆర్డినేటర్ ప్రవీణ్, డా॥ జగదీశ్, అడ్వైజర్స్ శ్రీనివాస్, డా॥ విజయ్, ఏఎన్‌ఎంలు వెంకటమ్మ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## ఆయుష్ మిషన్‌లో 10 ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు

ఈ నెల 31 వరకు గడువు..
నోడల్ అధికారి డాక్టర్ సునీత

**ప్రజాపక్షం/ములుగు:** జాతీయ ఆయుష్ మిషన్ కింద జిల్లాలో 10 ఉద్యోగాలను పొరుగు సేవల ప్రాతిపదికన భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ సునీత తెలిపారు. ఈ నెల 19 నుండి 31వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. మొత్తం 10 పోస్టుల్లో నాలుగు ఆయుష్ వైద్యాధికారులు, ఒక ఫార్మసిస్ట్, ఒక యోగా శిక్షకుడు, మూడు బహుళ ప్రయోజన ఆరోగ్య కార్యకర్తలు, ఒక సైకోసోషియల్ కౌన్సిలర్ పోస్టులు ఉన్నట్లు వివరించారు. వైద్యాధికారులకు నెలకు రూ.40వేలు, ఫార్మసిస్ట్‌కు రూ.15వేలు, యోగా శిక్షకుడికి రూ.28వేలు, ఆరోగ్య కార్యకర్తలకు ఒక్కొక్కరికి రూ.15వేల వేతనం చెల్లించనున్నారు. కౌన్సిలర్‌కు ఒక్కో సందర్భనకు రూ.500 చొప్పున చెల్లించనుండగా, ఏడాదికి కనీసం 200 సందర్భనలు ఉండనున్నాయి. 2026 జూలై 1 నాటికి అభ్యర్థుల వయస్సు 18 సంవత్సరాల నుండి 44 ఏళ్ల మధ్య ఉండాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయో పరిమితిలో సడలింపులు వర్తిస్తాయని తెలిపారు. విద్యార్హతలు, అనుభవ ధృవపత్రాలు ఇటీవల తీసుకున్న పాస్‌పోర్టు సైజ్ ఫోటోతో పాటు నిర్ణీత దరఖాస్తు పత్రాన్ని సమర్పించాలి. ప్రభుత్వ పని దినాల్లో ఉదయం 10.30 నుండి సాయంత్రం 5గంటల వరకు ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ఆయుష్ విభాగానికి దరఖాస్తులను స్వయంగా అందజేయవచ్చని సూచించారు. రిజిస్టర్ పోస్టు ద్వారా కూడా పంపవచ్చన్నారు. ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5గంటల తర్వాత అందిన దరఖాస్తులను స్వీకరించబోమని స్పష్టం చేశారు. పోస్టుల అర్హతలు, ఎంపిక విధానం, ఇతర వివరాల కోసం ములుగు జిల్లా అధికారిక వెబ్‌సైట్ www.mulugu.telangana.gov.in లోని నియామక ప్రకటనను పరిశీలించాలని డాక్టర్ సునీత సూచించారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఎంపిక కమిటీ ద్వారా నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

## అధికారి వేధింపులు భరించలేక మాస్ లీవుకు సిద్ధమైన ఉద్యోగులు

**ప్రజాపక్షం/మహాదేవపూర్;** మండలస్థాయి అధికారి వేధింపులు భరించలేక ఓ శాఖకు చెందిన ఉద్యోగులు మూకుమ్మడిగా సెలవులు పెట్టేందుకు సిద్ధమౌతున్నట్లు సమాచారం.కారణం లేకుండా మెమోలు జారీ చేయడం.సెలవు రోజుల్లో,రాత్రి వేళల్లో విధులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేయడంతో విసిగిన ఉద్యోగులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.నిర్విరామంగా విధులు నిర్వహించాలని ఒత్తిడి తెస్తున్నారని ఆవేదనవ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.వేధింపులు తాళలేక ఓ మహిళా ఉద్యోగిని డిప్యుటేషన్‌పై డివిజన్ కార్యాలయానికి వెళ్లినట్లు సమాచారం.మరో ఉద్యోగికి వరుస మెమోలు జారీ చేస్తూ బెదిరింపులకు గురి చేయడంతో మనోవేదనకు గురైనట్లు తెలిసింది,ఈ నేపథ్యంలో ఉద్యోగులంతా సమావేశమై సబ్ కలెక్టర్,అదనపు కలెక్టర్,జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.

## రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్యం

రవాణా శాఖ అధికారి శ్రీనివాస్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు తక్షణ అత్యవసర వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పిఎం రహత్ పథకాన్ని అమలు చేస్తోందని జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు. పిఎం రహత్ పథకంపై శుక్రవారం గణపురం మండలం చెల్పూర్ చౌరస్తాలో రవాణా శాఖల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌టిఒ శ్రీనివాస్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు తక్షణ అత్యవసర వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పిఎం రహత్ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ఈ పథకం కింద అర్హులైన ప్రతి ప్రమాద బాధితునికి గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకు, ప్రమాదం జరిగిన తేదీ నుంచి ఏడు రోజుల వరకు నగదు రహిత వైద్య చికిత్స పొందే అవకాశం ఉందని తెలిపారు. ఈ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కలెక్టరేట్, బస్ స్టాండ్లు, ప్రభుత్వ ఆసుపత్రులు, ఇతర జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో అవగాహన పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగ్‌లను ప్రదర్శించనున్నామని తెలిపారు.రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో వైద్య సహాయం అందించడం, పథకం ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యతని ఆయన సూచించారు. ఈ దార్ డిఆర్‌ఎం లక్ష్మణ్ మాట్లాడుతూ, ప్రమాద బాధితులకు సత్వర వైద్య సహాయం అందించడంలో సంబంధిత శాఖల సమన్వయం, ప్రజల సహకారం కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఎంవిఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

**ప్రజాపక్షం/చిట్యాల:** బతుకమ్మ, దసరా పండగలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్ సూచించారు. పండగల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, అసభ్యంగా ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బతుకమ్మ వేడుకల్లో పాల్గొనే మహిళల పట్ల గౌరవంగా మెలగాలని, వారిని ఇబ్బందులకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వేడుకల వద్ద భక్తి, సాంస్కృతిక గీతాలనే వినియోగించాలని, రాజకీయ, రెచ్చగొట్టే పాటలతో గొడవలకు కారణమైతే చర్యలు తీసుకుంటామన్నారు. పండగల పేరుతో ద్విచక్ర వాహనాలపై అతివేగంగా ప్రయాణించి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే వాహనాలు సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తులను కించపరిచే పోస్టులు, విద్వేషపూరిత వ్యాఖ్యలు చేయవద్దని సూచించారు. మండల పరిధిలోని సామాజిక మాధ్యమాల గ్రూపులపై నిఘా కొనసాగుతోందని తెలిపారు. ప్రజలంతా పోలీసులకు సహకరిస్తూ కుటుంబ సభ్యులు, స్నేహితులతో పండగలను ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలని ఎస్ఐ పోచంపల్లి సతీష్ కోరారు.

# గూడూరులో వైభవంగా సర్ధార్ సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ

## ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్

**ప్రజాపక్షం/గూడూరు;**మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో గౌడ్ కులస్తుల ఏర్పాటు చేసిన బహుజన వీరుడు సబ్బండ వర్గాల ఆత్మగౌరవ ప తీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ప్రతిష్టాపన అత్యంత వైభంగా జరిగింది. డప్పు చప్పుళ్ల నినాదాలు సంప్రదాయ నృత్యాల నడుమ పండుగ వాతావరణంలో జరిగిన ఈ వేడుకలో మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్డిసిసిఅధ్యక్షురాలు భూక్య ఉమా మురళి నాయక్ ముఖ్యఅతిథులుగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ మాట్లాడుతూ పీడనపై తిరుగుబాటు చేసి బహుజనుల ఆకాంక్షలకు అనుగుణంగా కులవృత్తులందరినీ ఏకం చేసి రాజ్యాధికార పోరాటం చేసిన మహనీయుడు సర్వాయి పాపన్న అని కొనియాడారు. ఆయన పోరాట స్ఫూర్తిని వీరత్వాన్ని నేటి యు వత ఆదర్శంగా తీసుకోవాలని బహుజనుంతా ఐక్యత తో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పాపన్న చరిత్ర భావితరాలకు తెలిసేలా హైదరాబాద్ నడిబొడ్డున విగ్రహ ఏర్పాటుకు సిఎం రేవంత్‌రెడ్డి మంత్రి పోన్నం



ప్రభాకర్‌టిపిసిసి అద్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు.ప్రజా ప్రభుత్వం ఇలాంటి మహనీయుల అడుగుజాడల్లో నడుస్తూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు కృషి చేస్తోందని పేర్కొన్నారు.పాపన్న ఆశయాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.ఈకార్యక్రమంలో సర్పంచ్ సునీత కొమ్మాలునాయక్ బుడిగే స తీష్ గౌడ్ కోడ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కప్పు ల అనిల్ కిషోర్ గౌడ్ సంఘం పెద్దలు మెరుగు మల్ల య్య గౌడ్ బొల్లికొండ వెంకన్న గౌడ్ సమ్మెట వెంకట య్య గౌడ్ పాను గంటి వీరస్వామి గౌడ్ సమ్మెట సుధాకర్ గౌడ్ పొన్నం వెంకన్న గౌడ్ బుర్ర జోగయ్య గౌడ్ సమ్మెట సాంబయ్య గౌడ్ మెరుగు సుదర్శన్ గౌడ్ చెవి పోతుల సుధాస్ గౌడ్ సమ్మెట ప్రభాకర్ గౌడ్ బాలగొని శ్రీధర్ గౌడ్ పూజారి సంధీప్ బత్తిని శంకర్ గౌడ్ ఓర్సు రాజేందర్ సమ్మెట చాణక్య గౌడ్ బొల్లికోండ రాజు చు ట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన గౌడ్ సంఘా ల నాయకులు స్థానిక ప్రజాప్రతినిధులు మండల జిల్లా నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పా ప న్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# రేవంత్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి

## పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మా రెడ్డి



**ప్రజాపక్షం/పరకాల :** తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపట్ల ప్రజలు తీవ్ర సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని పరకాల మాజీ ఎమ్మెల్యే సర్ల ధర్మారెడ్డి అన్నారు. శుక్రవారం పరకాల పట్టణంలోని ఎంఎన్ఆర్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రభుత్వ పాలనపై ఇప్పటికి సరైన అవగాహన లేకుండా పోయిందన్నారు. అదేవిధంగా తెలంగాణ ప్రజలపై ఏమాత్రం ప్రేమ లేకుండా వివరించడం పై ఆయన మండిపడ్డారు. తీవ్రమైన ఎల్నినో ప్రభావం పలన ఏర్పడే కరువు పరిస్థితులను ఎదుర్కోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందన్నారు.తెలంగాణలో కురిసిన వర్షాల వల్ల పై రాష్ట్రాలలో కురిసిన వర్షాల వల్ల తెలంగాణలో పారుతున్న నదులు పుష్కలంగా పారినప్పటికీ వాటిని నిల్వ చేయడంలో ఘోరంగా విఫలమైనట్టు ఆయన తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు తో పాటు ఇతర ప్రాజెక్టులను నింపినట్లైతే రాష్ట్రంలోని అనేక చెరువులను కుంటలను ఎస్ఆర్పి జలాలతో నింపే అవకాశం ఉండదని ఆయన అన్నారు. రాష్ట్రంలో అనధికారిక విద్యుత్ కోతలు పెరిగిపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రైతులను యాసంగి పంటను వేయాల్సిన చెప్పే దుస్థితిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకు వచ్చి రైతులను తీవ ఇబ్బందులకు గురి చేస్తుందని ఆయన మండిపడ్డారు. మోయలేని విధంగా హామీలు ఇచ్చిన రేవంత్ రెడ్డి వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైనరని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పల్లెల లక్ష్మి సందర్భంగా తులం బంగారం ఇస్తానని చెప్పిన హామీ ఏమైందని ఆయన నిలదీశారు. రైతు బీమా పథకాన్ని రేవంత్ రెడ్డి ఎందుకు నీరుగార్చాడని ధర్మారెడ్డి ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కల్లూరి పవన్ గంగపుత్ర నియామకం పట్ల హర్షం

## అభినందించిన గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి రాజేష్ ఖన్నా

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన గంగపుత్ర సామాజిక వర్గ నాయకుడు తెలంగాణ ఉద్యమకారుడు కాంగ్రెస్ పార్టీ బీసీ నాయకుడు కల్లూరి పవన్ గంగపుత్ర వరంగల్ శ్రీ భద్రకాళి దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా నియమితులైన సందర్భంగా తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుతూ గంగపుత్ర సామాజిక వర్గానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు బీసీ నాయకుడు కల్లూరి పవన్ గంగపుత్రకు భద్రకాళి దేవస్థానం పాలక మండలిలో సభ్యుడిగా అవకాశం కల్పించేందుకు సహకరించిన వరంగల్ పశ్చిమ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డికి తెలంగాణ గంగపుత్ర సంఘం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధితో పాటు భక్తుల సౌకర్యాల మెరుగుదలకు కృషి చేస్తూ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి మంచి పేరు సంపాదించాలని కల్లూరి పవన్ గంగపుత్రకు టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర శుభాకాంక్షలు తెలిపారు.

# పట్టభద్రుల ఓటరు నమోదుపై కాంగ్రెస్ అవగాహన



**ప్రజాపక్షం/ఖానాపురం:** వరంగల్ ...ఖమ్మం...నల్గొండ ప ట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ఆ పార్టీ నాయకులు ఓటరు నమోదు కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం ఖా నాపురం మండలం ధర్మారావుపేటలో ఏఎంసి వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, పిఏసిఎస్ చైర్మన్ వల్లే శ్రీనివాస్ యాదవ్ పట్టభద్రులను కలిసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. గతంలో ఓటు వేసిన పట్టభద్రులతో పాటు కొత్తగా అర్హత సాధించిన వారంతా ఫారం..18 ద్వారా ఓటు నమోదు చేసుకోవాలని శాఖమూరి హరిబాబు సూచించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అర్హులైన పట్టభద్రులను నేరుగా కలిసి నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని కోరారు. స్థానికంగా అందుబాటులో లేని పట్టభద్రులు తమ వివరాలను పార్టీ ఎన్నికల కోఆర్డినేటర్లకు అందించాలని వల్లే శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మండలంలోని గ్రామాల కోఆర్డినేటర్లు, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి కోడి మల్లేష్ యాదవ్‌ను సంప్రదించి అవసరమైన పత్రాలు అందజేస్తే ఓటు నమోదు చేయించుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో బుధరావుపేట సర్పంచ్ పెసరు రాణి గోవర్ధన్‌రెడ్డి, టిజి యూత్ జాయింట్ సెక్రటరీ మూడెం ఎల్లాగౌడ్, మాజీ ఎంపిటిసి బిక్కి మురళి, రజినీకాంత్, గ్రామ పార్టీ అధ్యక్షుడు ముదురు కుమారస్వామి, యూత్ అధ్యక్షుడు నవీన్, కార్యదర్శి లెంకలపల్లి రవి, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల పరామర్శ

**ప్రజాపక్షం/రాయపర్తి:** మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాయపర్తి టౌన్ యూత్ ఉపాధ్యక్షుడు చేగొండ సాయికుమార్ నాన్న చెగొండ ప్రభాకర్ అనారోగ్యంతో మరణించగా శుక్రవారం ఆయన పార్థివ దేహానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్య నాయక్ పూలమాలలు వేసి నివాళులు అర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గారే సహేంద్ర బిక్షపతి, ఉప సర్పంచ్ మచ్చ రమేష్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మెర కళ్యాన్ గౌడ్, ప్రవీణ్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు కేటాయించాలి

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** జనగామ పట్టణంలోని నిరుపేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు కెటాయించాలని సిపిఐ పట్టణ శాఖ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు లకావత్ ధన్వంతి లక్ష్మి నారాయణ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. శామీర్‌పేటలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయాలని, పట్టాలు ఇచ్చిన 60 మందికిపైగా పేదలకు భూమిని స్వాధీనం చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి సొప్పరి సోమయ్య కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, పుప్పాల ఐలయ్య, మురారీకర్ సుదర్శన్, భూక్య సత్యవతి, ఎం సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

## సామూహిక నిరాహార దీక్ష

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అక్టోబర్ 17న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో టిఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సామూహిక నిరాహార దీక్ష చేపట్టడం జరుగుతుందని, ఈ దీక్షలో జనగామ జిల్లా ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎం వెంకటేష్ పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో బాధ్యులు కృష్ణ, యాదవరెడ్డి, శ్రీహరి, శ్రీధర్, శ్రీనివాస్, కనకయ్య, లక్ష్మ ణ్ గౌడ్, నర్సింహులు, మద్రెడ్డి, నాగరాజు, గోవర్ధన్ రెడ్డి, సత్యనారాయణ, మహేష్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు రాజోలు విద్యార్థిని వసంత

**ప్రజాపక్షం/మహబూబాబాద్:** ఈ నెల 17 18 తేదీలలో రంగారెడ్డి జిల్లాలోని సరూర్ నగర్ లో జరగనున్న స్కూల్ గేమ్స్ అండర్ 17 సంవత్సరాల రగ్బీ బాలబాలికల పోటీలకు పదవ తరగతి చదువుతున్న రాజోలు విద్యార్థిని ధరావత్ వసంత ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.దామోదర్ తెలిపారు. సెప్టెంబర్ 30వ తేదీన డోర్నకల్ బిషప్ గ్రౌండ్లో జరిగిన జిల్లా స్థాయి రగ్బీ సెలక్షన్స్ లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పి.కాశీనాథ్ తెలిపారు. వసంత రాష్ట్రస్థాయికి ఎంపికవడం పట్ల ఉపాధ్యాయులు డి.మోహన్, కెబీకు, రాజేశ్వరి, వసంత, కిషన్, సతీష్,కిరణ్,నరేష్, రజనీరాణి, ప్రభాకర్, శ్రీదేవి, ప్రకాష్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి చైర్మన్ ఎ డెల్లి ఈశ్వరి అభినందించారు.

## అనుమతులు లేకుండా లక్కీ డ్రా నిర్వహిస్తే చర్యలు తప్పవు

**ప్రజాపక్షం/తొర్రూరు :** పట్టణ కేంద్రంలో అనుమతులు లేకుండా ఎవరైనా లక్కీ డ్రా నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ మహేందర్ రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని ఎంఎస్ స్విమ్మింగ్ పూల్‌లో అనుమతులు లేకుండా లక్కీ డ్రా నిర్వహిస్తూ ప్రజల నుంచి ఒకొక్కరి వద్ద రూ.499ల చొప్పున డబ్బులు వసూలు చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం తొర్రూరు పట్టణ కేంద్రంలో మహమ్మద్ సాజిద్ అనే వ్యక్తి ఎంఎస్ స్విమ్మింగ్ పూల్‌లో లక్కీ డ్రా పేరుతో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ప్రచారం చేస్తూ మొదటి బహుమతిగా మహేంద్రా థార్ కారు, రెండవ బహుమతిగా బర్గ్‌మన్ స్కూటీ, మూడవ బహుమతిగా ఐఫోన్ 15తో పాటు ఇతర బహుమతులు అందజేస్తామని ప్రకటించినట్లు తెలిపారు. లక్కీ డ్రా కూపన్ల విక్రయం ద్వారా యూపీఐ చెల్లింపుల రూపంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు ప్రాథమికంగా గుర్తించడం జరిగిందన్నారు. పంచుల సమక్షంలో నిర్వహించిన పంచనామా ప్రకారం మహేంద్ర థార్ కారు, బర్గ్‌మన్ స్కూటీ, ఐఫోన్ 15, లక్కీ డ్రా కూపన్ పుస్తకాలు, లక్కీ డ్రా బాక్స్, మొబైల్ ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకొని అనుమతులు లేకుండా లక్కీ డ్రా నిర్వహించినట్లు వచ్చిన ఆరోపణలపై పోలీసులు విచారణ చేపట్టి సేకరించిన ఆధారాల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

## ఆహార వృథాకు స్వస్తి పలకాలి

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** అక్టోబర్ 16 శుక్రవార"ప్రపంచ ఆహార దినోత్సవం"సందర్భంగా ఆహారాన్ని వృథా చేయకుండా, పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ప్రముఖ సామాజికవేత్త, మిల్లెట్స్ ప్రమోటర్ నిమ్మల శ్రీనివాస్ సూచించారు.ఆహారం విలువను గుర్తించి వృథాను అరికడుతూ, ఆరోగ్యకరమైన అలవాట్లతో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నిమ్మల శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

## మిషన్ వాత్సల్య చైల్డ్ ప్రొటెక్షన్ పోస్టులకు రాత పరీక్ష

**ప్రజాపక్షం/ జనగామ:** మిషన్ వాత్సల్య కింద జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్‌లో 12 పోస్టులకు కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేసేందుకు నిర్వహించిన రాత పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఈ పరీక్షలను స్వయంగా పర్యవేక్షించారు. 12 ఖాళీ పోస్టులకు 229 మంది ధరఖాస్తు చేసుకోగా 154 మంది హాజరయ్యారు. 75 మంది గైర్హాజర్ అయ్యారు. డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రటెక్షన్ ఆఫీసర్ ఒక పోస్టుకు 20 మంది ధరఖాస్తు చేసుకోగా 13 మంది హాజరయ్యారు. ప్రొటెక్షన్ ఆఫీసర్ పోస్టుకు 1కు 10మంది ధరఖాస్తు చేసుకోగా 7గురు హాజరయ్యారు. లీగల్ ప్రొటెక్షన్ పోస్టు 1కు 3 ధరఖాస్తు చేసుకోగా ముగ్గురు హాజరయ్యారు. సోషల్ వర్కర్ పోస్టు 02కు 13 మంది, అకౌంటెంట్ పోస్టు 1కు 18 ధరఖాస్తు చేసుకోగా 10 మంది డేటా అనలిస్ట్ పోస్టు 1కు 10 మంది అసిస్టెంట్ కమంవ డేటా ఎంట్రీ ఆపరేట్ పోస్టు 1కు 26 మంది హాజరయ్యారు. ఇలా పలు పోస్టులకు హాజరైన అభ్యర్థులకు రాత పరీక్షలు నిర్వహించగా ప్రశాంతంగా జరిగాయి. రాత పరీక్ష అనంతరం 41 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలు జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తో పాటు అదనపు కలెక్టర్ బెన్షాలోం, జిల్లా ఉపాధి కల్పన అధికారి, డిఎంహెచ్ఓలు పాల్గొన్నారు.

## ఏలూరి కృష్ణమూర్తికి ఎర్రబెల్లి పరామర్శ

**ప్రజాపక్షం/పాలకుర్తి :** మండలంలోని శాతాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ఏలూరి కృష్ణమూర్తి శస్త్రచికిత్స చేసుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా శుక్రవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆయనను పరామర్శించి త్వరగా కోలుకోవాలన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు సుధాకర్ రెడ్డి, పోశయ్య, వెంకటేశ్వర్లు, విజయ్, కృష్ణమూర్తి, యాదగిరి, యాకంరెడ్డి, రవివర్మ, రాజు, చిన్న యాకయ్య, శ్రీశైలం, వెంకన్న, శ్రవణ్ రెడ్డి, ఉపేందర్, మహేష్, తదితరులున్నారు.

## నేడు ఎమ్మెల్యే పర్యటన

**ప్రజాపక్షం/నెక్కొండ :** నెక్కొండ మండలంలో నేడు ప్రారంభించే అభివృద్ధి పనులను నర్సంపేట ఎంఎల్ఏ దొంతి మాధవ రెడ్డి శనివారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నారు. ఉదయం 9.30గంటలకు వెంకటాపురంలో 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు, 10.30గంటలకు పెద్ద కోర్పోల్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్‌తో పాటు మహిళా సంఘం భవనానికి శంకుస్థాపనలు చేస్తారని, ఉదయం 11.30గంటలకు నెక్కొండలో సుమారు రూ.60 లక్షల ప్రత్యేక అభివృద్ధి నిధులతో నిర్మించిన బతుకమ్మ ఆట స్థల సిసి ప్లాట్‌ఫాంను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12.30గంటలకు దీక్షకుంటలో విద్యుత్ సబ్‌స్టేషన్, మినీ పంక్షన్ హాల్‌కు శంకుస్థాపన చేయడంతో పాటు ఎస్‌సి కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించనున్నారు.

## ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ

**ప్రజాపక్షం/తొర్రూరు :** ఆడబిడ్డల ఆత్మగౌరవానికి బతుకమ్మ పండుగ ప్రతీక అని ఎంపిడిఒ కూస వెంకటేశ్వర్లు, తహశీల్దార్ గడీల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పువ్వులనే దేవతగా కొలుస్తూ ప్రకృతిని ఆరాధించే తెలంగాణ ఆడబిడ్డల బతుకమ్మ పండుగ దేశంలోని సాంప్రదాయ పండుగలన్నింటిలో ప్రత్యేకమైనదన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ హారీఫ్ హుస్సే న్, హౌసింగ్ ఏఈలు యామిని, బింధు, స ర్పంచ్‌లు స్వాతి, మాలోతు మౌ నిక, బానోతు రజిని, విజయ లింబ, సావి త్రి, శ్రీనివాస్, రమేశ్, బానోతు విద్యాసాగర్, సూపర్‌వైజర్లు గౌస్య, శ్రీదేవి, జిపిఒ ధరుని, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## సరస్వతి దేవి అలంకరణలో చండిక అమ్మవారు

**ప్రజాపక్షం/పాలకుర్తి :** శ్రీ సోమేశ్వర లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో దేవి వరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం 6వ రోజు శ్రీ సరస్వతి దేవి అలంకరణలో చండీ అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. అర్చకులు అమ్మవారికి పంచామృత అభిషేకం, కుంకుమార్చన, చండీ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో భాగం లక్ష్మి ప్రసన్న, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### హన్మకొండ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య



**ప్రజాపక్షం/కమలాపూర్ :** ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల ఆసుపత్రి వైద్య సిబ్బంది మెరుగైన వైద్య సేవలు అందించాలని హన్మకొండ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య అన్నారు. కమలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కానిపర్తి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని డాక్టర్ అప్పయ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన రికార్డులు, నివేదికలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, నివేదికల సమర్పణ ఆరోగ్య సేవలకు సంబంధించిన వివరాలను సమీక్షించి, వాటి నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కానిపర్తి పల్లె దవాఖానలో కుక్కకాటునకు సంబంధించిన రేబిస్ వ్యాక్సీన్, టిటి అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వీటిని ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో కానిపర్తి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం వైద్యాధికారి డాక్టర్ అరుణ్ కుమార్, హెచ్ఈవో సిహెచ్ రవీందర్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీకాంత్, టిబి నోడల్ పర్సన్ తౌటం ప్రభాకర్, ఏఎన్ఎం లావణ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎండిన పంటలకు నష్టపరిహారం అందించాలి



**ప్రజాపక్షం/తొర్రూరు :** ఆరుగాలం రైతు కష్టపడి పండించిన పంట నాణ్యమైన విద్యుత్ అందకపోవడంతో పాటు వర్షాలు లేక వేసిన పంటలు ఎండిపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ప్రభుత్వం స్పం దించి పంట నష్టపరిహారం అందించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొల్లం అశోక్ డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ రైతు సంఘం తొర్రూరు మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని అమ్మాపురం, గుర్తూరు, కంఠాయపాలెం గ్రామాల్లో విద్యు త్ లేకపోవడంతో వేసిన పంటలకు నీరు అందక ఎండిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అదికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులకు కష్టాలు మొదలయ్యాయన్నారు. వ్యవసాయ పంటలకు సరిపడా విద్యుత్ అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇప్పటికే గ్రామా ల్లో ఎండిపోయిన వరి పంటలను, మొక్కజొన్న పంటలకు ప్రభుత్వం సర్వే నిర్వహించి ఎండిన వరికి ఎకరానికి రూ.30వేలు, మొక్కజొన్న పంటకు ఎకరానికి రూ.25వేలు నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశా రు. లేనియెడల రైతు సంఘం ఆధ్వర్యంలో రైతాంగాన్ని మొత్తం కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన పోరాటాల ను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మట్టపల్లి కుమార్, కొత్త వెంకట్‌రెడ్డి, సోమిరెడ్డి, సాయిమల్లు, కంఠాయపాలెం గ్రా మ ఉప సర్పంచ్ జితేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కుమారస్వామి, సుధాకర్, ఎల్లయ్య పాల్గొన్నారు.

## 68 మూగజీవాలకు చికిత్స
## లింగ నిర్ధారణ వీర్యంతో పాడి రైతులకు మేలు

### డాక్టర్ ఎం రాజేందర్

**ప్రజాపక్షం/గూడూరు :** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల పరిధిలోని రాముల తండాలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం విజయవందంగా జరిగింది. స్థానిక సర్పంచ్ బాదావత్ రమేష్ నాయక్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ ఎం రాజేందర్ మాట్లాడుతూ పాడి రైతులు ప్రభుత్వ కల్పిస్తున్న గోపాలమిత్ర సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా లింగ నిర్ధారణ వీర్యం(సెక్స్ సీమెన్) అందుబాటులో ఉందని దీని ద్వారా రైతులు మంచి లాభాలు పోందివచ్చని సూచించారు. అనంతరం శిబిరానికి తీసుకోచ్చిన 68 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఔషధాలు అందజేవారు. ఇందులో ఎదకు రాని పశువులు 3 నట్టల నివారణ మందుల పంపిణీ( దూడలకు) 27 చూడి పరీక్షలు 15 గర్భకోశ వ్యాధుల చికిత్స గేదేలకు కృత్రిమ గర్భదారణ ఉన్నాయి. ఈకార్యక్రమంలో వీఎల్‌వో ఎస్ శారద గోపాలమిత్ర సూపర్‌మైజర్ ఎండి జహంగీర్ గోపాలమిత్రలు బి సుధాకర్ ఎ భాస్కర్ ఎం సురేష్ బి పుల్సింగ్ పాడి రైతులు తదితరులు పాల్గోన్నారు.

# వైభవంగా శారదా నవరాత్రి ఉత్సవాలు

### వీణా శారదను దర్శించుకున్న కొండా సురేఖ, కెప్టెన్ లక్ష్మీ కాంతరావు



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** వరంగల్ నగరంలోని శ్రీ శృంగేరి శారదా పీఠంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం మూలా నక్షత్రం సందర్భంగా శారదా అమ్మవారిని వీణాధారిణి సరస్వతీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. శృంగేరి పీఠాధిపతులు శ్రీశ్రీ భారతి తీర్థ మహాస్వామి, శ్రీశ్రీ విధుశేఖర భారతి స్వామి అనుగ్రహ ఆశీస్సులతో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా ప్రధానార్చకులు సంగమేశ్వర జోషి ఆధ్వర్యంలో సరస్వతీ పూజ, ఆవాహన నిర్వహించి మహా మంగళహారతి సమర్పించారు. డాక్టర్ బండారు సుమంత్‌కుమార్ సుకన్య దంపతులు సరస్వతి హోమం నిర్వహించారు. మాజీ మంత్రి, వరంగల్ తూర్పు ఎంఎల్ఏ కొండా సురేఖ, మాజీ ఎంపి కెప్టెన్ లక్ష్మీకాంతరావు దంపతులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్‌రాజ్‌లు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రధానార్చకులు వారికి వేదోక్త ఆశీర్వచనం అందించారు. మూలా నక్షత్రం సందర్భంగా విద్యార్థులు, చిన్నారులకు పూజలు చేసిన నోట్ బుక్స్, పెన్నులను అర్చకులు పంపిణీ చేసి సరస్వతీ కంకణాలు కట్టారు. భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు వీణా శారదను దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శృంగేరి శారద సేవా సమితి సభ్యులు పి దేవేందర్, కొమురయ్య, భాస్కర్, రామారావు, రవీందర్, కె భాస్కర్ రావు, మున్నా, రాజేంద్రప్రసాద్, శ్రీధర్, మాజీ కార్పొరేటర్ లీలావతి, కాంగ్రెస్ నాయకులు చిప్ప వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## దసరా నేపథ్యంలో నెక్కొండ అంగడి తేదీ మార్పు

**ప్రజాపక్షం/నెక్కొండ :** ప్రతి మంగళవారం నెక్కొండ మండల కేంద్రంలో నిర్వహించే వారపు అంగడిని దసరా పండగ నేపథ్యంలో రెండు రోజుల ముందుగా నిర్వహించనున్నారు. ఈ నెల 20న మంగళవారం పాలకవర్గం నిర్ణయం మేరకు ఈ నెల 18న ఆదివారం అంగడి నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి దయ్యాల సదానందం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాపారులు, రైతులు, కొనుగోలుదారులు తేదీ మార్పును గమనించి ఆదివారం జరిగే అంగడికి హాజరుకావాలని సూచించారు. పండగ సందర్భంగా ప్రజలకు, వ్యాపారుకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

## ట్రాఫిక్ కష్టాలకు చెట్ల తొలగింపుతో తాత్కాలిక పరిష్కారం

**ప్రజాపక్షం/నెక్కొండ :** నెక్కొండ..కేసముద్రం ప్రధాన రహదారిపై గుండ్రపల్లి చెరువు కట్ట వద్ద ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించేందుకు సర్పంచ్ బొల్లా యాదలక్ష్మి శివకుమార్ చర్యలు చేపట్టారు. కట్టకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించి రహదారిని చదును చేసే పనులు ప్రారంభించారు. ఇటీవల ఇరుకైన రహదారిపై లారీ, ఆర్‌టిసి బస్సు ఎదురెదురుగా రావడంతో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని తాత్కాలికంగా రాకపోకలకు ఇబ్బందులు తగ్గించే చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. శాశ్వత పరిష్కారం కోసం ఎంఎల్ఏ దొంతి మాధవరెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్ళి రహదారి నిర్మాణ పనులు చేపట్టేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు

## సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

**ప్రజాపక్షం/నెక్కొండ :** వరంగల్ జిల్లా నెక్కొండ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ, ఈజిఎస్ కార్యాలయాల అధికారులు, సిబ్బంది కలిసి బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ డాక్టర్ యాసం లావణ్య మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు పతీక అని పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలకు ప్రాధాన్యమిస్తూ మహిళలు సామూహికంగా జరుపుకునే ఈ పండగ తెలంగాణ ప్రత్యేకతను చాటుతుందన్నారు. తరతరాలుగా వస్తున్న ఆచారాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దయాకర్, ఎంపిడిఓ కార్యాలయ సూపరింటిడెంట్ జక్కుల ఐలయ్య, సీనియర్ అసిస్టెంట్ అనురాధ, జూనియర్ అసిస్టెంట్ సురేందర్, టైపిస్ట్ శ్రీనివాస్‌రెడ్డి, ఏపిఓ ఈజిఎస్ జాకబ్, ఈసి రజిత, తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి జక్కన్న పరామర్శ

**ప్రజాపక్షం/తొర్రూరు :** మండలంలోని ఫత్తేపురం గ్రామానికి చెందిన దోర్నాల మురళీ కుటుంబ సభ్యులను తొర్రూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మడిపెల్లి గ్రామ మాజీ ఎంపీటీసీ జక్కన్న(మహబూబ్‌రెడ్డి), జక్క ఇంద్రసేనారెడ్డిలు పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరాజేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు బాధితుని కుటుంబాన్ని పరామర్శించారు. గ్రామానికి చెందిన దోర్నాల మురళీ అనారోగ్యంతో మృతి చెందడంతో విషయం తెలుసుకొని నాయకులతో కలిసి జక్కన్న మృతుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి మృతుని కుటుంబ సభ్యులకు రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. జక్కన్న స్ఫూర్తితో బాధితుని కుటుంబానికి గ్రామ సర్పంచ్ ఇట్టె మాధవరెడ్డి, ఉప సర్పంచ్ కొండ సతీశ్‌లు 50కిలోల బియ్యంను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డిల సహకారంతో బాధితుని కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాధవరెడ్డి, ఉప సర్పంచ్ కొండ సతీశ్, వార్డు సభ్యులు రామ్‌సింగ్, పల్లె సాయిలు, వెన్నెం సోమిరెడ్డి, జమ్ముల యాకయ్య, ఇట్టె మహేందర్‌రెడ్డి, వెంకన్న, యర్రం రాజు యాదవ్, అన్వేశ్, కొమురయ్య, గ్రామ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు గణేశ్, సుమంత్, సందీప్, సూరిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యుత్ తీగలతో వన్యప్రాణుల వేటకు పాల్పడితే కఠిన చర్యలు

**ప్రజాపక్షం/మహాదేవపూర్;** విద్యుత్ తీగలతో వన్యప్రాణుల వేటకు పాట్పడితే చర్యలు తప్పవని ఎస్సై సాంబమూర్తి హెచ్చరించారు.శుక్రవారం మండలకేంద్రంలోని పోలీస్టేషన్‌లో అడవి జంతువుల ను వేటాడేందుకు గతంలో విద్యుత్ తీగలు ఏర్పాటు చేసిన నలుగుగు వ్యక్తులను ముంస్తు చర్యల్లో భాగంగా పోలీసులు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసారు.ఈ సందర్భంగా ఎస్సై సాంబమూర్తి మాట్లాడుతూ వన్యప్రాణుల వేటకు విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడం ప్రమాదకరమని దీనివల్ల మనుషుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు.ఇలాంటి చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసారు.గ్రామాల్లో అటవీ ప్రాంతాల్లో విద్యుత్ తీగలతో వేటకు పాల్పడుతున్నట్లు తెలిస్తే 8712658116 సంబరుకు సమాచారం అందించాలని అన్నారు.సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

## సర్పంచ్ అరెస్టను ఖండించిన నాగజ్యోతి

**ప్రజాపక్షం/ తాడ్వాయి:** తాడ్వాయి సర్పంచ్ ప్రవళిక అరెస్టను బిఆర్ఎస్ పార్టీ నియోజకఇంచార్జ్, మాజీ జడ్పీటీసీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా సమస్యలపై ప్రశ్నించే వారిపై అణిచివేత దోరణి అవలంభిస్తుందని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికి తమ అభిప్రాయాలను వెల్లడించే హక్కు ఉందని, ప్రజల తరుపున ప్రశ్నించే వారిపై చర్యలు తీసుకోడం సరైన పద్ధతి కాదని, తాడ్వాయి సర్పంచ్ అరెస్టుకు దారి తీసిన పరిస్థితులపై సమగ్ర దర్యాప్తు జరిపి, వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రజల గొంతు అణచివేయాలని చూస్తే బిఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని, ప్రజల హోక్కుల కోసం, ప్రజాప్రతనిధుల గౌరవం కోసం నిరంతరం పోరాడుతుందని ప్రజాస్వామ్య విలువలను కాపాడి, ప్రజల గొంతుకలను గౌరవించాలని స్పష్టం చేశారు.తాడ్వాయి సర్పంచ్ ప్రవళికకు న్యాయం చేయాలని డిమాడ్ చేశారు.

## నూతన మండల కాంగ్రెస్ అధ్యక్షుడికి సర్పంచ్‌ల ఘనసన్మానం



**ప్రజాపక్షం/వాజేడు:** మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన కాకర్లపూడి విక్రాంత్‌ను మండలంలోని కాంగ్రెస్ సర్మంచ్‌లు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్బంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతానికి నూతన అధ్యక్షుడు కృషి చేయాలని, పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ అభివృద్ధికి ముందుకు సాగాలని ఆకాంక్షించారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు. పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్ళడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తానని తెలిపారు. ఈ కార్యరకమంలో సర్పంచుళ సంఘం అధ్యక్షుడు భరత్ కుమార్, కృష్ణాపురం సర్పంచ్ విజయ్‌బాబు తదితరులు పాల్గోన్నారు.

# దసరా వేడుకల ఏర్పాట్లను పరిశీలన



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** సంగారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో దసరా ఉత్సవాల కోసం జరుగుతున్న ఏర్పాట్లను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి గురువారం పరిశీలించారు. రావణ ధహనం కోసం సిద్ధం చేస్తున్న 55 అడుగుల రావణసూరుడి బొమ్మతో పాటు బాణసంచా కాల్చేందుకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించి నిర్వహలకు పలు సూచనలు చేశారు. గత ముప్పై ఏళ్లుగా జగ్గారెడ్డి ఆద్వర్యంలో అంబేద్కర్ స్టేడియంలో ఏటా దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. భారీ రావణాసురుడి బొమ్మ దహనం పెద్ద ఎత్తున భాణసంచా ప్రదర్శనతో పాటు ప్రముఖ కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిసుస్తున్నాయి. ఈ ఏడాది కూడా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జగ్గారెడ్డి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఏర్పాట్ల పరిశీలన సందర్బంగా స్టేడియంతో పాటు చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జగ్గారెడ్డి సూచించారు. ముళ్లకంపలను తొలగించి చెత్తాచెదారం లేకుండా మైదానాన్ని శుభ్రం చేయాలని మున్సిపల్ సిబ్బందికి ఉత్సవ నిర్వాహకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపిపీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, భవాని యూత్ అసోసియేషన్ అద్యక్షుడు బెస్త నగేష్ ,సభ్యులు నాయకులు బొంగుల రవి, కూన సంతోష్, కిరణ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ సూచించారు. భూపాలపల్లి జిల్లా సింగరేణి కమ్యూనిటీ హాల్ లో విద్యార్థులకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన సైబర్ క్రైమ్ ఫ్రాడ్ కా ఫుల్‌స్టాప్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ, ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఇంటర్నెట్, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే లింకులను క్లిక్ చేయవద్దని, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత ఫొటోలు, పాస్‌వర్డ్‌లను ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు తమ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు కూడా ఈ విషయాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎవరైనా సైబర్ ఆర్థిక మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, భూపాలపల్లి టౌన్ సీఐ శ్రీనివాస్, సైబర్ క్రైమ్ ఎస్సై శ్రీనివాస్, ఆర్ఎస్ఐ శివ కుమార్, విద్యార్థులు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** దేవి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అమ్మవారికి ప్రత్యేక పూజలునిర్వహించారు. సదాశివపేట పట్టణంలోని వాసవి కాన్యకాపరమేశ్వరి ఆలయంలో నిజాంపురం కుటుంబ సభ్యులు అశోక్,రవి నాగరాజు ఆద్వర్యంలో జైభవాని యూత్ మాజీ కౌన్సిలర్ ఆకుల శివ, దిడ్డేగే నగేష్, కటకం కిరణ్, మల్లికార్జున, వంశీ, సాయిరాజు, సీటు, ధనుంజయ్ గౌడ్, రచ్చన్న స్వామి, సారపు అబి చంద్రయ్య, ఆద్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఆయన స్థానిక నాయకులతో కలిసి పాల్గొనిన అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని భక్తులకు అన్న ప్రసాదం అందించే కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. దేవి నవరాత్రి ఉత్సవాలు, భక్తి ఆద్యాత్మికతకు ప్రతీకలని ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు, సమాజంలో ఐక్యతను, భక్తి భావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో స్థానిక నాయకులు , మహిళలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింత గోపాల్ ,శ్రీదర్ రెడ్డి,చింతసాయినాథ్, చీలమల్లన్న నగేష్, కౌన్సిలర్ వైశాలి, నాగరాజు గౌడ్, దిడ్డగే వినోద్, కోట్రీక్ , సాయిరాజ్, తండెడ్పల్లి లక్ష్మ ణ్, కంది మల్లేశం, పెద్ద గౌడ్, మల్లికార్జున్ శంకర్, కొత్త రామన్న , కోడూరు అంజయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబురాలు



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంగారెడ్డి కలెక్టరేట్‌లోని అన్ని శాఖల ఉద్యోగులు తెలంగాణ నాన్ గెజిటెడ్ అదికారుల సంఘం ఆద్వర్యంలో శుక్రవారం ఆంగరంగ వైభవంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు సంప్రదాయ ఆటపాటలతో కలెక్టరేట్ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ సందర్బంగా అదనపు కలెక్టర సంగీత గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి బతుకమ్మ ఆడారు. బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు ప్రకృతిపై ప్రేమకు పూల ప్రాదాన్యతను ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. వివిధ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులు అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ వలయంగా ఏర్పాడి సంప్రదాయబద్ధంగా ఆడిపాడారు. తెలంగాణ సాంస్కృతి సారధి కళాకారులు ఆలపించిన బతుకమ్మ పాటలు వేడుకలను మరింత ఉత్సాహాన్ని తీసుకోచ్చాయి. పాటలకు అనుగుణంగా మహిళా ఉద్యోగులు నృత్యాలు చేస్తూ సంబురాల్లో పాల్గొన్నారు. విధి నిర్వహణలో నిత్యం బీజిగా ఉండే ఉద్యోగులు ఒక చోట చేరి పండుగను సామూహికంగా జరుపుకోవడంతో కలెక్టరేట్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఈ వేడుకల్లో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అదికారిణి లలితా కుమారి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా. లలితాదేవి, టీజీఓ జిల్లా అద్యక్షులు ,డా. వైద్యనాథ్, టీజీఐఐసి మాజీ చైర్మన్, నిర్మల జగ్గారెడ్డి, జిల్లా టీఎన్‌జీఓ అద్యక్షులు మహిళా నాయకులు కార్యవర్గ సభ్యులు కలెక్టరేట్‌లోని వివిధ శాఖల మహిళా ఉద్యోగులు సిబ్బంది సాంస్కృతిక సారథి కళాకారులు కలెక్టరేట్ సమీప కాలనీ మహిళలు పాల్గొన్నారు.

## మా శక్తి అసోసియేషన్ ఆద్వర్యంలో ఘనంగా దుర్గామాత నవరాత్రులు



**ప్రజాపక్షం/పటాన్చెరు :** పటాన్‌చెరు లోనశ్రీనగర్ కాలనీలో మాశక్తి అసోసియేషన్ ఆద్వర్యంలో విజయదశిమి నవరాత్రి ఉత్సవాలు, ఆంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అసోసియేషన్ అద్యక్షుడు అభికోణమారాజు ,కమిటీ సభ్యుల నిర్వహణలో 2వ సంవత్సరం దుర్గామాత విగ్రాహన్నీ ప్రతిష్ఠించి రోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్బంగా అసోసియేషన్ ఆద్వర్యంలో సుమారు 2000మంది భక్తులకు భారీ అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కాలనీవాసులు ,భక్తులు, పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రసదా న్ని స్వీకరించారు. ఈ సందర్బంగా కమిటీ ప్రతినిధులు, మాట్లాడుతూ కాలనీ పెద్దలు గౌరవ అద్యక్షులు, కొనమరాజు, వాసుదేవరావు, రాజు శ్రీనివాస్, చంద్రమోహన్ రావుల సూచనలు కాలనీవాసులు పూర్తి సహకారంలో ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అమ్మవారి దివ్య కృపాకటాక్షాలతో ప్రతిఒక్కరు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు అనిరుద్, ఇంత్‌రెడ్డి, నిఖిల్, సాయి, రాకేష్, హర్షవర్ధన్, అన్నమరాజు, సందీప్ గణేష్, హర్ష తనీష్ చరణ్, హరిసీకేస్, బివిరావు, సంతోష్ రెడ్డిలతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు భక్తులు పాల్గొన్నారు.

## నర్సాపూర్‌లో హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు చేయాలి



**ప్రజాపక్షం/నర్సాపూర్ :** నర్సాపూర్ పట్టణంలో హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, ఫాస్టఫుడ్ సెంటర్లలో ఆహార నాణ్యతపై వెంటనే తనిఖీలు నిర్వహించాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సాపూర్‌లో నాణ్యత లేని ఆహార పదార్థాల విక్రయం ప్రజలు, కార్మికులు, విద్యార్థుల ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారుతోందని అన్నారు. మూడు రోజుల క్రితం ఒక మండీ హోటల్‌లో ఆహారం తీసుకున్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో 30 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. గురువారం సిటీ ప్యాలెస్‌లో సమోసాలో గుట్కా లాంటి పదార్థం కనిపించడం ఆహార నాణ్యతపై అనుమానాలకు తావిస్తోందన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే సహించబోమని, సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని విమర్శించారు. అధికారులు తక్షణమే స్పందించి పట్టణంలోని అన్ని హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు చేయాలి. టిఫిన్, ఫాస్టఫుడ్ సెంటర్లలో నాణ్యతను పరిశీలించాలి. పరిశుభ్రత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలి. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కమిటీ సభ్యులు దాసు పాల్గొన్నారు.

## దసరా పండగ సందర్భంగా ఇసుక రవాణా నిలిపివేత

**ప్రజాపక్షం/చిట్యాల:** దసరా పండగను పురస్కరించుకొని నేటి నుండి ఈ నెల 21వ తేదీ వరకు చిట్యాల మండల పరిధిలో ఇసుక రవాణాను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు చిట్యాల తహసీల్దారు వసంతరావు, ఎస్ఐ పోచంపల్లి సతీష్ సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. పండగ వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఎవరైనా నిబంధనలకు విరుద్దంగా ఇసుక రవాణా చేపడితే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయాన్ని ఇసుక కూలీలు, ట్రాక్టర్ యజమానులు గమనించి సహకరించాలని, నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని అధికారులు స్పష్టం చేశారు.

# సిద్దిపేట కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ సంబురాలు

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ పండుగ వేడుకలను శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో ఘనంగా జరుపుకున్నారు. ఐడీఓసీ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో జిల్లా కలెక్టర్ హైమావతి, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ అందమైన పూలతో బతుకమ్మలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన మహిళా ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. ధనిక, పేద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ తమ సంప్రదాయాల ప్రకారం అమ్మవారిని ఆరాధిస్తారని, భక్తిశ్రద్ధలతో పూజించే వారిని భగవంతుడు తప్పక అనుగ్రహిస్తా



డని తెలిపారు. అమ్మవారి శక్తిని స్మరిస్తూ 'శ్రీ మాత్రే నమః' అని భక్తితో ప్రార్థించినా అమ్మవారు అనుగ్రహిస్తారని తెలిపారు. చండీ హోమం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎక్కడ నిర్వహించినా వీలైనంతవరకు పాల్గొనాలని సూచించారు. నవరాత్రుల సందర్భంగా ప్రతి ఒక్కరూ అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు. అమ్మవారు ప్రకృతిలో, ప్రాణశక్తిలో, క్షమాగుణంలో, మర్యాదలో, శరీర కాంతిలో, ఐశ్వర్యంలో వివిధ రూపాల్లో కొలువై ఉంటారని పేర్కొన్నారు. శక్తి స్వరూపిణి అయిన అమ్మవారిని నిష్ఠతో, భక్తిశ్రద్ధలతో పూజించాలని పిలుపునిచ్చారు.
అనంతరం అమ్మవారి స్తోత్రాలను పఠించారు. బతుకమ్మలను అందంగా తీర్చిదిద్దిన శాఖలకు బహుమతులు ప్రదానం చేశారు. రెవెన్యూ శాఖకు మొదటి బహుమతి, డీఆర్‌డీఓకు రెండో బహుమతి, పట్టుపరిశ్రమల శాఖకు మూడో బహుమతి అందజేశారు. ఉద్యానవన శాఖ, టీఎస్జీఓలకు కన్సొలేషన్ బహుమతులు ప్రదానం చేశారు. బాలసదనం నుంచి బతుకమ్మలను తయారు చేసి తీసుకువచ్చిన చిన్నారులను జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్, లక్ష్మీ కిరణ్, డీఆర్‌ఓ నాగరాజమ్మ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చిరు ధాన్యాల సాగుతో అధిక లాభాలు

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** చిరు ధాన్యాల సాగుతో అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగ అభివృద్ధి చేందవచ్చని జగదేవ్‌పూర్ ఎఒ



వసంతరావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అలీరాజ్‌పేట గ్రామంలో రైతు కిష్టారెడ్డి సాగు చేసిన రాగి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎల్‌నినో ను దృష్టి పెట్టుకోని రైతులు రభిలో చిరు ధాన్యలతో పాటు పప్పు దినుసుల సాగుపై దృష్టిపెట్టాలని సూచించారు. రాగి వంటి చిరుధాన్యాలతో సాగుతో పోషకాహార భద్రతను పెంపొందించడంతో పాటు పంటల వైవిద్యీకరణకు ప్రోత్సాం లభిస్తుందని తెలిపారు.

## ఉద్యమకారుల గుర్తింపుపై సీఎంకు కృతజ్ఞతలు

**ప్రజాపక్షం/చేర్యాల:** తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కోసం ప్రత్యేక ఏర్పాటు



చేయడంపై చేర్యాల మండల ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం పాత బస్టాండ్ వద్ద సమావేశమై సీఎం రేవంత్ రెడ్డికి, కేకే కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల హామి మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం గుర్తింపు కోసం చర్యలుచేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం చేర్యాల మండల అధ్యక్షుడు అంబటి అంజయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి అందె అశోక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పుర్మ ఆగంరెడ్డి, కొమురవెల్లి దేవస్థాన మాజీ చైర్మన్ ఆడెపు చంద్రయ్య, చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోయిని శ్రీనివాస్ , మాజీ జెడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు, డైరెక్టర్ పచ్చిమడ్ల వెంకటయ్య, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ కాటం మల్లేశం, ఎండి. ఖాజ, పాల సాయిలు, రాములు, పర్శరాములు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ కిష్టయ్యమృతి తీరనిలోటు...

**ప్రజాపక్షం/మెదక్ :** నార్సింగి గ్రామ మాజీ సర్పంచు బిఆర్ఎస్ పార్టీ నాయకులు నీలగిరి కిష్టయ్య మృతి వార్త దిగ్భ్రాంతికి గురి చేసిందని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, అన్నారు. కిష్టయ్య మృతి విషయం తెలుసుకొని శుక్రవారం నార్సింగి గ్రామానికి చేరుకొని ఆయన పార్థీవదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాడ సానుభూతి తెలిపారు. ఈకార్యక్రమంలో పాపన్నపేట మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు జగన్, సర్పంచులు మల్లేశం, సాయిరెడ్డి, ఎంపీటీసీల ఫోరం మాజీ అద్యక్షులు కుబేరుడు, నాయకులు సోములు, దుర్గయ్య, పాటు తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/మంగపేట:** మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఇండ్ల యాకయ్య తల్లి రామక్క ఇటీవల మరణించిన విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు పార్టీ నాయకులతో కలిసి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రామక్క చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తరపున మృతురాలి దశదిన కర్మ ఖర్చుల నిమిత్తం ఐదు వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు బాధిత కుటుంబానికి అండగా నిలిచి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు అయ్యోరి యాణయ్య, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి చింత పున్నారావు, జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సభ్యులు మురుకుట్ల నరేందర్, జిల్లా నాయకులు మాసిరెడ్డి, వెంకటరెడ్డి శానం సత్యనారాయణ పాల్గొన్నారు.



# నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యం :డిఇ స్వామి

**ప్రజాపక్షం/గజ్వేల్ :** రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాన్స్ కో డివిజనల్ ఇంజనీర్ స్వామి పేర్కొన్నారు. శుక్రవారం వర్గల్ శివారులోని బుచ్చిరోని కుంట ట్రాన్స్ ఫార్మర్, సమీప వ్యవసాయ పొలాలను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకోగా, నియంత్రిక (ఫ్రాన్స్ ఫార్మర్) 100 కేవీఏ డిటిఆర్ ఓవర్ లోడ్‌లో ఉన్నట్లు గుర్తించారు. అయితే రైతులకు, వ్యవసాయ పొలాలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు యుద్ధ ప్రాతిపదికన అదనంగా 25 కేవీఏ డిటిఆర్ నియంత్రికను ఏర్పాటు చేశారు. నాణ్యమైన విద్యుత్, మెరుగైన విద్యుత్ సరఫరా తమ లక్ష్యమని డిఈ స్వామి స్పష్టం చేశారు. రైతుల విద్యుత్ అవసరాలను గుర్తించి, సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఏడిఈ శ్రీనివాస్, ఏఈ వెంకటేష్ తదితరులు ఉన్నారు.

# అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు...

**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలంలోని కమ్మర్లపల్లి గ్రామంలో శుక్రవారం ఏడు రోజుల బతుకమ్మ పండుగ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మహిళలు,యువతులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ



పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో గ్రామ సర్పంచ్ రేగుల శ్యామల దేవయ్య,ఉపసర్పంచ్ కప్పెర రాజిరెడ్డి, గ్రామ వార్డు సభ్యులు పిల్లి పవన్, జక్కుల రాములు, ఎలుకపల్లి విజయ భూమయ్య, రేణుక పరశురాములు, కొట్టేపల్లి విజయ, పరశురాములు, పసుపుల యాదగిరి, కేంగర్ల కనకవ్వ, యువతీ యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మర్పడగ క్షేత్రం లో ఘనంగా శరన్నవరరాత్రి ఉత్సవాలు



**ప్రజాపక్షం/కొండపాక :** కొండపాక మండలం మర్పడగ క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి.శుక్రవారం మూల నక్షత్ర పూజలు జరిగాయి. క్షేత్ర నిర్వాహకులు డాక్టర్ చెప్పెల హరనాథ్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. విజయదుర్గ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అమ్మ వారి వద్ద పూజలుచేసి సుమారు వంద మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ లు నోట్ బుక్స్ పెన్నులు పంపిణీ చేశారు. అమ్మవారికి విశేష పంచామృత ఫలరస అభిషేకం, చతుష్షష్టి ఉపచార పూజ, నవావరణ హవనం కుంకుమపూజలు తదితర కార్యక్రమాలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పూజలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో మర్పడగ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కల్లెపల్లి శ్రీనివాస్ ఉపాధ్యాయులు విజయ ట్రస్ట్ సభ్యులు నర్సింహారెడ్డి, తిరుపతి రెడ్డి, మల్లిఖార్జున్, మల్లేశం,సత్యనారాయణ రెడ్డి, తదితరులున్నారు.

# రైతులకు 6 గంటల కరెంట్ ఇవ్వకుంటే సీఎం కుర్చీ దింపడం ఖాయం - దండే అపర్ణ

**ప్రజాపక్షం/నర్సాపూర్ :** వ్యవసాయానికి 6 గంటల కరెంట్ ఇవ్వకపోతే సీఎం రేవంత్ రెడ్డిని కుర్చీ నుంచి దింపడం ఖాయమని టీఆర్ఎస్ (తెలంగాణ రక్షణ సేవ) నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ దండే అపర్ణ అన్నారు. శుక్రవారం నర్సాపూర్ మండలంలోని నాగులపల్లి, జక్కపల్లి, చిప్పల్తుర్తి, మూసాపేట్ గ్రామాల్లో పంటలు ఎండిపోతున్నాయని రైతులు తెలపడంతో ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరెంటు కోతల వల్ల చేతికి వచ్చిన పంట నాశనమైందని, ఈ గ్రామాల్లో ప్రజలకు వ్యవసాయం తప్ప వేరే ఆధారం లేదని అన్నారు. కనీసం 6 గంటల కరెంట్ అయినా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంతో మాట్లాడి రైతులకు



మేలు జరిగేలా చూస్తానని, పంట నష్టపోయిన రైతు కుటుంబాలకు లక్ష రూపాయల పరిహారం అందజేయాలని కోరారు. లేకపోతే సీఎం కుర్చీ దింపడం ఖాయమని హెచ్చరించారు.

## మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో గజ్వేల్ కిషోర్ కు బ్లాక్ బెల్ట్

**ప్రజాపక్షం/కొండపాక :** హైదరాబాద్‌లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఓకినవా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ పరీక్షల్లో దుద్దెడ కరాటే క్రీడాకారుడు గజ్వేల్ కిషోర్ ఘన ప్రతిభ కనబరిచారు. కరాటేలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి ఆయన బ్లాక్ బెల్ట్ సాధించినట్లు కరాటే సమాఖ్య ప్రతినిధులు వెల్లడించారు.ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్ ఎస్.శ్రీనివాసన్ చేతుల మీదుగా గజ్వేల్ కిషోర్ అధికారికంగా బ్లాక్ బెల్ట్‌ను అందుకున్నారు. కఠోర సాధన, అంకితభావంతో కిషోర్ ఈ ఘనత సాధించడం అభినందనీయమని కరాటే సమాఖ్య ప్రతినిధి, ఇంస్ట్రక్టర్ బ్లాక్ బెల్ట్ ఫిఫ్త్ డాన్ తిరుపతి నర్సింలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు పలువురు కిషోర్‌ను అభినందించారు.



## అమ్మవారి దర్శనభాగ్యం ఎంతో సంతోషం

**–ప్రజాపక్షం/శివ్వంపేట :** అమ్మవారి దర్శనభాగ్యం ఎంతో సంతోషాన్నిచ్చిందని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. మండల పరిధిలోని శివ్వంపేటలో వెలసిన శ్రీబగలాముఖి శక్తిపీఠంలో శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ బగలాముఖీ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించడం జరిగింది. అమ్మవారి ఉపాసకులు బ్రహ్మశ్రీ శాస్త్రుల వెంకటేశ్వరశర్మ, లక్ష్మి దంపతులు, శక్తిపీఠం స్థలదాతలు పబ్బ రమేశ్‌గుప్తా ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్‌నుప్రత్యేకంగా ఆహ్వానించి అమ్మవారి ప్రత్యేక శాలువాతో ఘనంగా సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా జేసీ నగేష్ మాట్లాడుతూ ఇక్కడి బగలాముఖీ శక్తిపీఠంలో అమ్మవారి దర్శనభాగ్యం తమకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. మళ్లీ ఒకసారి అమ్మవారి దర్శనానికి తప్పకుండా వస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బగలాముఖీ ట్రస్టు సభ్యులు పత్రాల శ్రీనివాస్‌గౌడ్, గిర్దావర్ నిరంజన్, పీడీ గంగాల రమేష్ తదితరులు ఉన్నారు.

## మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

**ప్రజాపక్షం/పెద్ద శంకరంపేట:** పెద్ద శంకరంపేట మండల పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో నివసిస్తున్న నీలకంఠ దుర్గాప్రసాద(32) మనస్తాపంతో ఉరివేసుకుని మృతి చెందాడు. కుటుంబ సమస్యలతో మద్యానికి అలవాటు పడిన దుర్గాప్రసాద్ గురువారం రాత్రి తల్లి, అక్కతో గొడవపడి గదిలోకి వెళ్లి నిద్రపోయాడు. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు చూసేసరికి ఫ్యాన్‌కు తువాలతో ఉరివేసుకుని మృతి చెంది ఉన్నాడు. మృతుడి తల్లి హేమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

## సరస్వతి మాతగా ఏడుపాయల దుర్గమ్మ



**ప్రజాపక్షం/పాపన్నపేట :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గ భవాని క్షేత్రంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా 6వ రోజు శుక్రవారం వనదుర్గమ్మను చదువుల తల్లి సరస్వతి దేవి రూపం, తెలుపు రంగు వస్త్రాలంకరణలో వీణ, హంసలతో సుందరంగా అలంకరించి భక్తులకు అమ్మ దర్శనం కల్పించారు. పూజారులు పార్థివ శర్మ, రాము శర్మ, రాజశేఖర్ శర్మ, పవన్ శర్మలు, మూల విరాట్ వన దుర్గమ్మను సరస్వతి మాతగా అలంకరించారు. గోకుల్ మండపంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పూజారులు శంకర్ శర్మ, మురళి శర్మ, రాజేష్ శర్మ, సదాశివశర్మలు అమ్మవారిని అలంకరించి వేద మంత్రోచ్ఛారణల మధ్య భక్తులు కుంకుమార్చనలతో పాటు వివిధ పూజలు చేశారు. మమ్మేలు మాయమ్మ, ఏడుపాయల వనదుర్గమ్మ, అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. భక్తుల జయజయ ద్వానాల మధ్య ఏడుపాయల వన దుర్గమ్మ క్షేత్రం హోరెత్తింది. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ప్రతాప్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మధుసూదన్ రెడ్డి, రవి, బ్రహ్మం, దీపక్ రెడ్డి, మహేష్. నరేష్, సాయి బాబా తదితరులు ఉన్నారు.

## కొండపాకలో ఘనంగా సద్దుల బతుకమ్మ



**ప్రజాపక్షం/కొండపాక :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను కొండపాక గ్రామంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. గ్రామంలో ఏడు రోజుల పాటు బతుకమ్మలను పేర్చి పూజించే ఆనవాయితీ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. మహిళలు సంప్రదాయబద్ధంగా రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ సంబరాల్లో పాల్గొంటారు. ఈ సంప్రదాయం తరతరాలుగా కొనసాగుతూ గ్రామ సంస్కృతికి ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తోంది. సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటారు.

# ఆరోగ్యకరమైన తల్లి-బిడ్డలతోనే ఆరోగ్య తెలంగాణ



**ప్రజాపక్షం/మెదక్:** ఆరోగ్యకరమైన తల్లిబిడ్డలతో ఆరోగ్య తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 9వ జాతీయ పోషణ మాసం2026 ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలకు వయస్సుకు తగిన సమతుల ఆహారం అందించాలని సూచించారు. అంగన్‌వాడి కేంద్రాల ద్వారా పోషకాహారం సేవలను మెరుగుపరచడంతో పాటు, చిన్నారుల శారీరక, మానసిక, మేధో వికాసానికి నాణ్యమైన ఆహారపు అలవాట్లపై ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం పోషణ మాసంలో ఉత్తమ సేవలందించిన అధికారులు, అంగన్‌వాడి సిబ్బందిని మెమొంటోలతో సత్కరించారు. చిన్నారులు ఏర్పాటు చేసిన, పోషకాహార ప్రదర్శన స్టాళ్లను సందర్శించి, ఆహార పదార్థాలను పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి, డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి గణేశ్వర్, ఇతర అధికారులు, అంగన్‌వాడి సిబ్బంది పాల్గొన్నారు.

# పిఏసిఎస్ వైస్ చైర్మన్‌గా నరసింహ బాధ్యతల స్వీకరణ



**ప్రజాపక్షం/మనోహరాబాద్ :** పీఏసీఎస్ వైస్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎరుకల నరసింహను కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, నూతన బాధ్యతల్లో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. పార్టీ అభివృద్ధితో పాటు రైతుల సంక్షేమానికి కృషి చేయాలని వారు సూచించారు. ఈ సందర్భంగా ఎరుకల నరసింహ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పీఏసీఎస్ వైస్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించిన పార్టీ పెద్దల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పేర్కొన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ,రైతులకు సేవ చేయడానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తూ, వారికి అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. పీఏసీఎస్ ద్వారా రైతులకు అందే సేవలు మరింత మెరుగుపడేలా తన వంతు కృషి చేస్తానని, రైతుల అవసరాలను గుర్తించి వారి అభివృద్ధికి తోడ్పడేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. తనపై విశ్వాసం ఉంచిన పార్టీ నాయకులకు, తన నియామకాన్ని అభినందిస్తూ సన్మానించిన కాంగ్రెస్ నాయకులకు,కార్యకర్తలకు ఎరుకల నరసింహ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ దండు సత్యనారాయణ,కాంగ్రెస్ నాయకులు వీరబోయిన గోపాల్,మాదంశెట్టి వెంకటేశం, తుమ్మల రాజు యాదవ్, ఎరుకల వెంకటేష్, ఇర్ఫాన్, రంగాచారి, పోచయ్య, అమరేందర్, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిగూడ తండా పంచాయతీకి రాష్ట్రస్థాయి గుర్తింపు




**ప్రజాపక్షం/నర్సాపూర్ :** నర్సాపూర్ మండలంలోని ఎల్లారెడ్డిగూడ తండా గ్రామ పంచాయతీ పనితీరు పట్ల పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ కమిషనర్ పి.జె.వెస్లీ సంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం ఆయన ఎల్లారెడ్డిగూడ తండా పంచాయతీని సందర్శించి గ్రామ పంచాయతీ రికార్డుల నిర్వహణ, 15వ ఆర్థిక సంఘం నిధుల చెల్లింపుల ప్రక్రియ, సమగ్ర అభివృద్ధి ప్రణాళిక అమలు, పంచాయతీ కార్యదర్శి మూడు నెలల ఆన్‌లైన్ హాజరు, నాలుగు రకాల వ్యర్థాల వేర్పాటు విధానం, పంచాయతీ ఆస్తుల పరిరక్షణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. గ్రామ పంచాయతీని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నందుకు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిని అభినందిస్తూ శాలువాలతో సత్కరించారు. అనంతరం గ్రామంలోని ఘన వ్యర్థాల నిర్వహణ షెడ్, కంపోస్టింగ్ యూనిట్, పల్లె ప్రకృతి వనం, నర్సరీలను సందర్శించి సేంద్రీయ ఎరువు తయారీ ప్రక్రియను పరిశీలించారు. ఈ పర్యటనలో డీపీఓ, డీఎల్‌పీఓ, ఎంపీఓ, పాలకవర్గ సభ్యులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి




**ప్రజాపక్షం/మెదక్ :** నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, వారిని క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు, జగిత్యాల జిల్లా ఇన్‌చార్జి గడ్డం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ వద్ద దీక్ష చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు బీజేపీ తరపున ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు అందిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల డిమాండ్లను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి బీజేపీ మద్దతుగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గడ్డం కాశీనాథ్, నాయిని ప్రసాద్, కౌన్సిలర్లు అఖిల భరత్, పబ్బ రాజమణి లక్ష్మణ్, ఎం.ఎల్.ఎన్ రెడ్డి, సతీష్, బెండల స్వామి, సాయికుమార్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతీ స్వరూపిణీ గా మర్పడగ విజయదుర్గ



**ప్రజాపక్షం/కొండపాక :** కొండపాక మండలం మర్పడగ విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సరస్వతీ స్వరూపిణీ గా మర్పడగ విజయదుర్గ భక్తులకు దివ్యమంగళ స్వరూపంగా దర్శనమిచ్చింది. క్షేత్ర నిర్వాహకులు డాక్టర్ చెప్పేల హరినాథ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరిగాయి.

## దుర్గామాత మండపం వద్ద అన్నదానం

**ప్రజాపక్షం/రామాయంపేట:** పట్టణంలోని మల్లన్న కాలనీలో శ్రీమల్లిఖార్జున నవదుర్గా ఉత్సవ సమితి అద్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్బంగా ఐదవ వార్డు కౌన్సిలర్ చౌదరి చరిత, బిఆర్ఎస్ నాయకులు చౌదరి సుప్రబాత్‌రావు, ఝాన్సీలింగాపూర్ సర్పంచు మానెగల్ల రామకిష్టయ్యలు హాజరై అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంబించారు. నవ రాత్రి ఉత్సవాల్లో బాగంగా దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ అమ్మవారి ఆశీస్సులు పొందుతున్నారు. అన్నదాన కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈకార్యక్రమంలో ఉత్సవ సమితి నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ కిష్టయ్య మృతి పార్టీకి తీరని లోటు



**ప్రజాపక్షం/పాపన్నపేట :** మండల పరిధిలోని నార్సింగి మాజీ సర్పంచ్ నీలగిరి కిష్టయ్య గుండె పోటుతో మరణించాడు. ఆయన మృతి బీ.ఆర్.ఎస్ పార్టీకి తీరని లోటని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ నాయకురాలు ఎం.పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. కిష్టయ్య మృతి వార్త తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కిష్టయ్య మృతి విషయం తెలుసుకున్న పద్మాదేవేందర్‌రెడ్డి శుక్రవారం నార్సింగ్ గ్రామానికి చేరుకున్నారు. ఆయన పార్థివదేహంపై పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె వెంట అంత్యక్రియలో పాపన్నపేట మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు జగన్, స్థానిక సర్పంచ్ మల్లేశం, రామతీర్థం సర్పంచ్ సాయిరెడ్డి, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు కుబేరుడు, నాయకులు సోములు, దుర్గయ్య, నాగసాన్ పల్లి శ్రీనివాస్ గౌడ్. జిన్న చంద్రయ్య, బాబాగౌడ్, గోపాల్, అనిల్ రెడ్డి, బద్రి మల్లేశం, శ్రీనివాస్, వెంకట్ రాములు, రవీందర్ నాయక్, సామెల్, నర్సింలు తదితరులు ఉన్నారు.

## జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** జిల్లా పోలీసు కార్యాలయంలో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకులకు జిల్లా కలెక్టర్ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై సందడి చేశారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆద్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో జిల్లా పోలీసు కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తెలంగాణ ప్రకృతి అందాలు ,ఆచార సంప్రదాయాలు ఉట్టిపడేలా వివిధ రకాల రంగు రంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి సంప్రదాయ దుస్తుల్లో మహిళల ఉత్సాహంగా బతుకమ్మ ఆటపాటలతో వేడుకలను జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను బావితరాలకు అందించడంతో పాటు పోలీసు కుటుంబాల మధ్య ఆత్మీయత ఐక్యతను పెంపొందించేలా ఈ వేడుకలు నిర్వహించారు. కుటుంబ సభ్యులందరు. ఒక చోట చేరి ఆనందోత్సహాలతో బతుకమ్మ పండుగను జరుపుకోవడం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఆదనపు ఎస్పీ చైతన్యరెడ్డి, జిల్లా అటవీ శాఖ అదికారి సబ్ కలెక్టర్ ఉమా హారతి , జిల్లా పోలీసు అదికారులు సిబ్బంది తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.

## ఆరవ రోజు న అమ్మవారు సరస్వతి దేవి రూపంలో దర్శనం

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆరవరోజు అమ్మవారు సరస్వతి దేవి రూపంలో భక్తకోటికి దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు తెల్లవారుజామున నుండి పెద్ద సంఖ్యలో పాల్గొని అభిషేకం ,కుంకుమార్చనలు చేసి అమ్మవారికి ఓడి బియ్యం ,చీరలతో మొక్కులు చెల్లించుకుని మహిళలు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. భక్తులు లలితా సహస్రనామాలు పారాయణంతో పాటు భజన పాటలు పాడుతూ ఆలయంలో ఆద్యాత్మిక వైభవం నెలకొన్నది. ఆలయ కమిటీ ఆద్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదం పంఫిణి చేశారు. ఇట్టి కార్యక్రమంలో ఆలయ ధర్మ కర్త కోడిదే లింగమ్మ యాదగిరి భక్త మండలి సభ్యులు రాదమ్మ, చిట్టి బాబు, శ్రీదర్ మహేంద్ర బాబన్న రవి శ్రీకాంత్ గౌడ్ ఇందిరా లక్ష్మి , రేణుక సంతోష్, గిత అర్చన తదితరులు పాల్గొన్నారు.